

# నిదురించే తోటలోకి

- మన్నెం శారద



*(గత సంచిక తరువాయి)*

**గేటు తలుపుకి తాళం వేయకుండా,** ఇంటి మెయిన్ డోరు గడియ వేయకుండా లోనికి అదోలాంటి ట్రాన్స్‌లో వెళ్తున్నట్లుగా వున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూసింది రాజేశ్వరి.

"ఏంటమ్మా అబ్బాయి వెళ్ళాడా?" అనడిగింది.

వరూధిని ఏమీ జవాబివ్వకుండా గదిలోనికి వెళ్ళిపోయింది.

రాజేశ్వరి తెల్లబోతున్నట్లుగా తన గదిలోకి వచ్చింది.

చిత్రని సహజంగా రాత్రి ఎంత లేటయినా తన గదిలోకి తీసుకెళ్ళడం వరూధినికి అలవాటు.

"మంచి నిద్రలో వుంది, ఈ పూటకి నా దగ్గర పడుకోనివ్వవే!" అని బ్రతిమిలాడినా వరూధిని వినేదికాదు. అలాంటిదీరోజు కూతుర్ని కూడా తీసుకెళ్ళలేదు.

ఏం జరిగిందసలు? మళ్ళీ కూతురి గదిలోకి తొంగి చూసింది.

వరూధిని బ్లాంకెట్ కప్పుకుని పడుకుంది.

రాజేశ్వరి తలుపు దగ్గర కేసి తన గదిలోకెళ్ళి పోయింది. బ్లాంకెట్‌లో వరూధిని చీకటిలో ఎటో చూస్తోంది.

ఏదో ప్రకంపనలకి లోనవుతోంది మనసు.

హేమంత్ అలా ఒక్కసారిగా ఉరుములేని పిడుగులా అంత మాటనేసాడేమిటి?

ఎంత అమాయకంగా, ఆడపిల్లలా సిగ్గుపడుతూ మొగమాటంగా మాట్లాడేవాడు.

ఒక విధంగా తానే చాలా చొరవగా ప్రవర్తించేది. కానీ.. ఆ చొరవలో తానెప్పుడూ మరో భావాన్ని ప్రకటించలేదే?

మరెందుకిలా?

ఒక విధంగా తానూ తనకి తెలియకుండా అతని స్నేహాన్ని అతని సాన్నిధ్యాన్ని కోరుకుంటున్న మాట వాస్తవం. కానీ.. దాన్నిలా ప్రేమకి దారి తీయించాలని తానాశించలేదు.

'లేదా?' ఆమె మనసు ఆమెనే అపహాస్యం చేసింది.

వరూధిని అతను ముద్దుపెట్టి వదిలేసిన చేతిని చూసుకుంది పదే పదే!

ఏవో ప్రకంపనలు.

నిజానికిది తనకి మొదటి పురుష స్పర్శకాదు!

కాని.. ఆ వివాహంలో ఆ స్పర్శలో తన మనసు పులకించింది లేదు.

అదో తంతులా జరిగిపోయింది.

హృదయానికి దగ్గరకి రాని తతంగమది.

ప్రేమరాహిత్యమైన పెళ్ళి..

పులికింత లేని ఒక సమాగమం.. ఒక వ్యభిచారంలా.

ఫలితంగా ఒక బిడ్డకి తల్లయింది.. లోకానికి చూడటానికి ఒక వ్యక్తికి భార్యయింది. అంతే!

తాను ఎంతో భావనలతో, ఆశలతో అల్లుకున్న ప్రేమ మందిరం అగ్గిపుల్ల గీసినట్లుగా భస్మీపటలమైంది.

తల్లిదండ్రులని గౌరవించి మనసా వాచా చక్రవర్తిని వివాహమాడింది. తనువూ మనసూ అతనికి అర్పించి జీవించాలని ఉవ్విళ్ళూరింది. కాని.. ఫలితం! హృదయమే లేని కసాయి వాడి చేతిలో పడి మాడి మసయిపోయింది తన బ్రతుకు. ఇప్పుడు కూడా తనని తన మానాన బ్రతకనివ్వకుండా కనీసం కడుపున పుట్టిన బిడ్డ మొహం కూడా చూడకుండా.. దుర్మార్గానికి ఒడిగడుతున్నాడు.

ఇలాంటి తరుణంలో హేమంత్ స్నేహం నిజంగానే తనకొక మలయమారుతంలాంటిదే

కానీ.. హేమంత్ ఒక్కసారిగా ఇలా చెబుతాడని తాననుకోలేదు.

వరూధినికి అంతా అయోమయంగా వుంది.

అలా అని హేమంత్ పై కోపం కూడా రావడం లేదు.

నిజానికి ఆమె మనసు కూడా హేమంత్ సాన్నిధ్యాన్ని కోరుతోంది.

కానీ.. అది సాధ్యమయ్యేదేనా?

తాను ఒక బిడ్డ తల్లి. తన తల్లి, చుట్టూ సమాజం తనకి పదే పదే గుర్తుచేసే మాట.

ఆ మాటతో అందరూ తన హృదయానికి, శరీరానికి ఒక ఇనుప భద్రతా వలయాన్ని ఏర్పరిచి తమ బాధ్యత తీరినట్లుగా దానివలన ఈ సమాజానికి ఎంతో శ్రేయస్సు చేసిన వారిలా ఫీలవుతారు.

వరూధినికి పిచ్చెక్కినట్లయింది.

హేమంత్ అలా అనకుండా వుండాల్సింది అని పదే పదే మనసుకి సర్ది చెప్పుకోవాలని ఎంతగా ప్రయత్నించిన ఆమె హేమంత్ ప్రేమని పూర్తిగా నిరాకరించలేకపోతోంది .

ఇదిమిత్థం కాని ఆలోచనతో ఆమెకా రాత్రి నిద్రే కరువయ్యింది.

మొదటిసారిగా హేమంత్‌కి పనిమీద ఏకాగ్రత కుదరలేదు.

రమేష్ బాబిచ్చిన ఫైల్‌ని స్టడీ చెయ్యలేక పోతున్నాడు. తానేంటి, ఇంత ధైర్యంగా చెప్పేసేడు.

వరూధిని ఏమనుకుందో!?

కొంపదీసి రమేష్ బాబుని వాయించినట్లుగా రయ్యిన వచ్చి తన పరువు కూడా అందరిలో తియ్యదు కదా!

అలా చెయ్యదని మనసు చెబుతున్నా చిన్న భయం అతన్ని వెంటాడుతూనే వుంది.

అతని చూపులు గుమ్మాల్ని వెదుకుతూనే వున్నాయి.

"సార్! మిమ్మల్ని పెద్దసారు పిలుస్తున్నాడు" వసంత పిలుపుకి ఉలిక్కిపడి చూసి లేచి వెళ్ళాడు హేమంత్.

"హేమంత్ నోట్ ప్రిపేర్ చేసేవా, మూడు గంటలకి సెక్రటేరియట్‌లో మీటింగు వుంది" అన్నాడు రమేష్ బాబు.

"లేదు" హేమంత్ జవాబు విని రమేష్ నివ్వెరబోయి చూశాడు.

"అదేంటి. డి.సి.ఇ ఇప్పటికి రెండుసార్లు కబురు చేసారు" అన్నాడు కంగారుగా.

"నా కర్థం కావడం లేదు"

ఈసారి మరింత తెల్లబోయాడు రమేష్‌బాబు.

అలాంటి పదం హేమంత్ నోటివెంట రావడం మొదటిసారి.

"అదేంటి హేమంత్, నువ్విది వరకు డీల్ చేసిందే కదా! వంట్లోకానీ బాగోలేదా?" అన్నాడు గాభరాగా.

హేమంత్ జవాబు చెప్పలేదు.

"టాబ్లెట్స్ ఏవన్నా తెప్పించనా?"

"వద్దు. ఆ సబ్జక్టు నాది కాదు ఎవరు కన్సెర్న్‌డో వాళ్ళని నోట్ ప్రిపేర్ చేయమనండి"

"ఈ టైములో ఆ సంగతులు మాట్లాడకు. అవతల కొంపంటుకుపోతుంది. ప్లీజ్!" కాళ్ళు పట్టుకున్నంత పనిచేసేడు రమేష్‌బాబు.

హేమంత్ ఫైలు తీసుకుని సీట్లోకొచ్చి తల విదిలించుకుని ఎలాగో నోట్ ప్రిపేర్ చేసేడు.

టైపయిన నోట్‌ని తీసుకుని రమేష్‌బాబు హడావుడిగా వెళ్తుంటే "నేనూ రూమ్‌కి వెళ్తాను" అని చెప్పి రూమ్‌కి బయల్దేరాడు హేమంత్.

చాలాసేపు నిద్రపోవాలని ప్రయత్నించేడు కాని.. ఆలోచనల నిండా వరూధినే వుంది.

ఆమె రెస్పాన్స్ కోసం అతని మనసు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నది. క్షణాలు యుగాలవ్వడమేంటో తెలిసింది.

తల దువ్వుకుంటూ ఒకవేళ వరూధిని ఆఫీసు వైపుగాని వెళ్ళి వుంటుందా? తను అనవసరంగా ఇంటికొచ్చేసేడేమో! అనుకుంటుండగా డోర్ నాకయింది.

హేమంత్ చిరాగ్గా వెళ్ళి తలుపు తీసేడు.

ఆశ్చర్యం.

ఎదురుగా వరూధిని.

హేమంత్ చెప్పలేని సంభ్రమానికి లోనయ్యాడు. కానీ... లోపల అనుకోని భయం కూడ.

ఆమె ఏం మాట్లాడుతుందో?

"లోపలికి రావచ్చా?"

అప్పుడు స్పృహలో కొచ్చేడు హేమంత్.

కంగారుగా తేరుకుని "రా! రా! వరూధిని!" అన్నాడు దారిస్తూ.

వరూధిని లోనికొచ్చి కుర్చీలో కూర్చుంది.

హేమంత్ కూడా కూర్చున్నాడు.

కొన్ని క్షణాలు మౌనం.

మంచులా ఘనీభవిస్తున్న క్షణాలు.

"నీతో మాట్లాడాలని.." అంది చివరికి వరూధినే. కళ్ళెత్తి ఆమె వైపు చూశాడు హేమంత్.

వరూధిని అతని వైపు చూడటం లేదు.

తలదించుకుని అరచేతిలో గీతలు గీసుకుంటూ "నిన్న.... అదే.. ఎందుకలా?" అంది మెల్లిగా.

"ఎలా?" అన్నాడు హేమంత్.

వరూధిని కాస్సేపు మాట్లాడలేదు.

"నీకేం తప్పనిపించలేదా?" ఆమె తలెత్తి అతనివైపు చూసింది.

అతను తల అడ్డంగా తిప్పేడు.

"కాని.. నేను మన మధ్య స్నేహాన్నే ఆశించేను. ఇప్పుడు చూడు. ఎంత ఇబ్బందిగా వుందో.. నీతో మాట్లాడటం."

వరూధిని నిజంగానే తొట్రుపడుతున్నట్లుగా ఒక్కొక్క మాట పలికింది.

హేమంత్‌కి కొంత అర్ధమయ్యింది.

ఆమె కూడా తనని ఇష్టపడుతుంది. అందుకే ... ఇంత నిదానంగా కూడబలుక్కుని మాట్లాడుతోంది. లేకపోతే సీమటపాకాయలా పేలిపోయేదే.

"ఇందులో తప్పేమిటో నాకర్ధం కావటంలేదు వరూధినీ. నేను నిన్ను ఇష్టపడుతున్నాను అదే నీకు తెలియజేసేను"

"అంటే..?" కళ్ళెత్తి అతనివైపు చూస్తూ అడిగింది వరూధిని.

"వంకరటింకర కథలొద్దు. నేను నిన్న నా జీవితభాగస్వామినిగా చేసుకోవాలనుకుంటున్నాను. జీవితమంతా నువ్వు నాకు కావాలి. దానికి పెళ్ళేకదా మార్గం" చాలా సూటిగా ఒక పురుషుడిలా మాట్లాడేడు హేమంత్.

అతని కంఠస్వరంలో నిర్దుష్టమైన అభిప్రాయానికి ఆశ్చర్యంగా చూసింది వరూధిని.

"కాని.. ఇది జరిగేది కాదు"

"ఆ సంగతి తర్వాత. నువ్వు.. నువ్వు.. నన్నిష్టపడుతున్నావా? ఆ విషయం చెప్పు ముందు"

"ఎందుకు చెప్పాలి? జరగని వాటిమీద ఎందుకు ఇష్టాలు ఏర్పరచుకోవాలి?"

"ఇష్టాలు ఏర్పడిన వాటిని జరిగేట్లు చూసుకోవాలి."

హేమంత్ వైపు తెల్లబోయినట్లుగా చూసింది వరూధిని.

"కాని.... నేను నీకన్నా పెద్దదాన్ని. ఆ సంగతి తెలుసా?"

"ఇది మొదటి ప్రతిబంధకమా! ట్రాష్. ఇవన్నీ నేను నమ్మను."

"లోకం నమ్ముతుంది."

హేమంత్ బదులుగా పెద్దగా నవ్వాడు.

అతనలా నవ్వడం వరూధిని ఇదివరకెన్నడూ చూడలేదు.

చాలా వింతగా చూసిందతనివైపు.

"నీ జీవితం ఇలా నాశనమయితే చూస్తూ కూర్చున్న లోకం.. నువ్వు తిరిగి సంతోషంగా సుఖంగా వుండటాన్ని చూడలేని లోకం సంగతి దేనికి వరూధినీ? వెనక్కి తిరిగి కోపంగా చూస్తే పారిపోయే మొరిగే కుక్కలాంటిదీ లోకం. దాని సంగతి వదిలేయ్. నీ అభిప్రాయం మాత్రమే చెప్పు"

"కానీ.. వరహీనం"

ఆమె మాట పూర్తికాకుండానే మళ్ళీ నవ్వాడు హేమంత్. "ఒక ధీరోదాత్తురాలయిన వరూధినిలాంటి అమ్మాయిలు మాట్లాడాల్సిన మాటలు కావివి. ఒక్కసారి గతచరిత్ర అంతా క్షుణ్ణంగా గుర్తుచేసుకుని ఆలోచించు. గురజాడగారి కన్యాశుల్కం చదివేవా? ముక్కుపచ్చలారని పసిపిల్లల్ని కాటికి కాళ్ళు చాచిన ముసలివాళ్ళు ఏ ఉద్దేశ్యంతో పెళ్ళి చేసుకున్నారు. కేవలం వృద్ధాప్యంలో వాళ్ళ చేత సేవలు చేయించుకోవడానికే. భార్య వయసు చిన్నదయితే ఆమె తనకి ఊడిగం చేయడానికి పనికొస్తుందనే. వితంతువులకి అన్ని

నిబంధనలు పెట్టి వారి బ్రతుకులు నిస్సారం చేసి ఎంతమంది అయినవారే వాళ్ళనెలా వుపయోగించుకున్నది... ఆ అపరాధాలన్నీ చీకటిలోనే ఎలా కలిసిపోయిందీ.. నీకు తెలిసే వుంటుంది. అందుకే వీటి సంగతి వదిలేయ్. నువ్వు నన్నిష్టపడుతున్నావో లేదో మాత్రమే చెప్పు."

వరూధిని అతని వైపు చాలా ఆశ్చర్యంగా చూసింది. అందులో ఆరాధన మిళితమై వుంది.

"కాని..?"

"నాకు తెలుసు. నీ సందేహం చిత్రగురించి. చాలాసార్లు నువ్వు చిత్ర గురించిన భయాలు సందేహాలూ చెబుతూనే వచ్చావు. నిన్ను నిజంగా ప్రేమించిన వాడు చిత్రని కూడా ప్రేమించి తీరాలి. అది నూటికి నూరుపాళ్ళూ నిజం. చిత్ర ఒక పసిపాప. పైగా నీ ప్రాణం. నువ్వు నా ప్రాణం. మరి ప్రాణాన్ని ఎవరైనా హింసించుకుంటారా! ద్వేషిస్తారా! చిత్రకి నేనే కన్నతండ్రినవుతాను. నువ్వంగీకరిస్తే..."

అప్పుడు వచ్చింది దుఃఖం.

అది ఆనందమో.. బాధో తెలియని ఒక వుద్వేగం.

వరూధిని కళ్ళు ధారలై వర్షించాయి.

ఆమె మోకాళ్ళలో తల దించుకుని వెక్కెక్కి ఏడ్చింది. తలిరాకులా కదిలిపోయింది.

లతలా వూగిపోయింది.

ఒక్కసారి ఆమెని పొదవి పట్టుకుని ఊరడించాలనిపించినా మనసుకి అడ్డుకట్ట వేసేడు హేమంత్.

ఆ దుఃఖం ఆమె నుండి వెళ్ళిపోవటమే అవసరం. కాస్సేపటికి ఆమె వుద్వేగం నుండి బయట పడింది.

ఈసారి... కాస్త ధైర్యంగా హేమంత్ వైపు చూసింది.

"కానీ.. మీ ఇంట్లో మన పెళ్ళికి ఒప్పుకుంటారా?" బేలగా అడిగింది.

"ఒప్పుకోరు" చాలా ఖచ్చితంగా ఠక్కున జవాబిచ్చేడు హేమంత్.

వరూధిని బెదిరినట్లు చూసిందతనివైపు.

హేమంత్ చిన్నగా నవ్వి "ఈ ప్రశ్న నీకన్నా ముందు సరోజని ఆంటీయే అడిగింది. "

"అంటే... ఆమెకి చెప్పేవా?"

ఔనన్నట్లుగా తలూపేడు హేమంత్.

"ఆంటీ చాలా విశాల హృదయం, అభ్యుదయ భావాలు కల వ్యక్తి. మనిషి బలాల్ని, బలహీనతల్ని కలిపి స్వీకరించే సహృదయం ఆమెకుంది. భాష ఏదయినా భావాలు వున్నతమైనవి. ఆమె నాకు ముందే చెప్పింది. మీ నాన్న ససేమిరా ఒప్పుకోడు. ఎదిరించి చేసుకోగల సత్తా వుంటేనే.... ఆ అమ్మాయికి చెప్పు. లేకపోతే వద్దని."

హేమంత్ జవాబు విని మరింత ఆశ్చర్యపోయింది వరూధిని.

"ఆంటీని.. చూడాలి"

"చూద్దువుగాని.. ముందసలు ఈ సంగతి చెప్పు. నన్నిష్టపడుతున్నావా?" హేమంత్ సూటి ప్రశ్నకి వరూధిని కనులు వాల్చేసింది.

ఆ వెంటనే లేచి నిలబడి "వెళ్ళాలి. చీకటి పడింది" అంది కంగారుగా.

హేమంత్ సన్నగా నవ్వి "ఇంతకంటే లేటుగా మనం టాంక్ బండ్ మీద కూర్చుని కబుర్లు చెప్పుకున్న సందర్భాలెన్నో వున్నాయి. అప్పుడు లేని భయం ఇప్పుడా?" అన్నాడు దగ్గరగా వస్తూ.

అతన్ని చూసి ఒకలాంటి భయం, సిగ్గు మొదటిసారి కలిగి లేచి నిలబడింది వరూధిని.

కానీ... అనుకోని విధంగా అతని చెయ్యి ఆమె తలని నిమిరింది ఆప్యాయంగా.

"పిచ్చీ! భయపడకు. నువ్వు నాకో అపురూపమైన వరానివి. నిన్ను పదిలంగా కాపాడుకుంటాను. ఇక నీకే భయాలూలేవు. అన్నిటికీ నేనున్నాను నీకు. అదేకదా నిజమైన ప్రేమ. "

బదులుగా వరూధిని అతన్ని అల్లుకుపోయింది.

తలని నేనున్నానని వాల్చుకోవడానికొక భుజం దొరికింది ఆమెకిన్నాళ్ళకి.

అదేకదా... అసలైన పురుషత్వం.!!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Click here to share your comments on this story